సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 7 । డిసెంబర్ । 2023



జీవనోపాధికి కొత్త బాట

ఎస్సీ,ఎస్టీ మహిళలకు ప్రభుత్వం తోడ్పాటు నందిస్తోంది. ఉన్నతి మహిళా శక్తి పథకం ద్వారా ఆటోలు ఇవ్వాలని నిర్ణయించింది.

-8లో



చైన్‌స్నాచర్ అరెస్టు

ఈజీమనీ కోసం చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రూ.4లక్షల విలువ చేసే 80గ్రాముల బంగారు స్వాధీనం చేసు కున్నట్లు పోలీసులు తెలిపారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.380
రెండోరకం	రూ.200	రూ.298

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 130 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రేపటి నుంచి అంతర్జాతీయ సదస్సు

కురబలకోట: మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ ఫర్ లర్నింగ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సు నిర్వహి స్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. తైవాన్, జర్మనీ, జపాన్, స్విట్జర్లాండ్ తదితర దేశాలకు చెందిన వారు ముఖ్య అతిథు లుగా హాజరవుతారన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



న్యాయవాదులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి

రాయచోటి టౌన్: రాజీమార్గమే రాజమా ర్గమని జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి కృ ష్ణన్ కుట్టి అన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించే జాతీయ లోక అదాలత్‌పై బుధ వారం కోర్టు ఆవరణలో ఇతర న్యాయ మూర్తులు, న్యాయవాదులతో ఆయన సమావే శాన్ని నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా అన్ని మండలాలకు చెందిన పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గొడవలు పడిన కక్షదారులకు రాజీ మార్గమే రాజమార్గమనే విషయం తెలియజేసి న్యాయం చేయాలన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ

రాయచోటిటౌన్: పీఎంకెవీవై పథకం ద్వారా క్రాంప్టన్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపు ణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ క న్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో రాయచోటి ప్రాంతంలోని ప్లంబర్లకు రెండు రోజులు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ప్లంబింగ్‌లో మూడు సంవత్సరాల అనుభవం ఉన్న వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 19 -54 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు ఈనెల 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9000517637/8332020532 నం బర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఫెన్సింగ్ జట్టు ఎంపిక



పోటీలను తిలకిస్తున్న ఆర్‌ఐఓ రమణరాజు

రాజంపేట రూరల్: విజయనగరంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు జరగనున్నాయి.ఇందులో పాల్గొనే జిల్లా జట్టును బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఆర్ఐఓ, ప్రిన్సి పల్ రమణరాజు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురా వాలని చెప్పారు. కాడిట్ బాలికల విభాగంలో (ఈపీ) ఆర్మీన్, బాలుర విభాగం(ఫాయిల్)లో జోషిత్‌రెడ్డి, అక్రిత్‌రెడ్డిలు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల పీడీ మురళీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు రామాంజనేయులు, కోచ్ సురేష్, జిల్లా ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి ఏ చంద్రకళావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆహ్వానం

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సం ఘం ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహించనున్న మహాసభలకు తెలుగు ఉపా ధ్యాయులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికా ర్జునరెడ్డి తెలిపారు. కడప జెడ్పీ సభా భవనం లో నిర్వహించనున్న ఈ సభల్లో జిల్లా భాష, చరిత్ర, సంస్కృతి, కళలు తదితర అంశాలపై నిపుణులైన వారు ప్రసంగిస్తారన్నారు. ఇది తెలుగు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తం గా ఉంటుందన్నారు. విద్యాశాఖ అధికారితో చర్చించి సభల్లో పాల్గొనే తెలుగు ఉపాధ్యా యులకు ఆన్ డ్యూటీ అవకాశం ఇప్పించేం దుకు ప్రయత్నిస్తామన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం బహూకరణ

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్ని ధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి బుధ వారం రు.1,00,116లు విరాళంగా అందాయి. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం లద్దిగంకు చెం దిన అక్కులరెడ్డి గారి నీరజమ్మ, శంకరరెడ్డిల కుమారుడు వినీల్ కుమార్ రెడ్డి ఈ మొత్తం అం దజేశారు. ఈ సందర్భంగా దాతలచే స్వామికి పూజలు చేయించి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించారు.

పంట..కన్నీట

- అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలను కుదిపేసిన మిచాంగ్
- నేలవాలిన అరటి, బొప్పాయి, తమలపాకు



రాజంపేట మండలం వరదయ్యగారిపల్లిలో అరటి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తదితరులు

సాక్షి రాయచోటి: అన్నమయ్య,వైఎస్సార్ జిల్లాలమిచాంగ్ తీవ్ర ప్రభావం చూపింది. ఊహిం చని విధంగా వీచిన పెనుగాలులతో పంట నష్టం జరిగింది. మిచాంగ్ తుపాను జిల్లా వ్యాప్తంగా వర్షాన్ని కురిపించినా, మరోవైపు అన్నదాతలకు నష్టానికి గురి చేయడం బాధకలిగిస్తోంది. ప్రధా నంగా పంట తోటలపై ప్రభావం చూపగా, వ్యవసాయ పంటలను కూడా కొంతమేర దెబ్బతీ సింది. జిల్లా వ్యాప్తంగా రూ. 65-70 కోట్ల మేర పంటలకు నష్టం వాటిల్లింది.

రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో తీవ్ర నష్టం

రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైల్వేకోడూరు, రాజంపేట, వీరబల్లి, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాల్లోని పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. అత్య ధికంగా అరటి పంట సుమారు 5700 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. 160 ఎకరాల్లో బొ ప్పాయి, 190 ఎకరాల్లో తమలపాకు, కూరగాయల పంటలు, కలింగర, టమోట, దోస, మామిడి, అరటి, బొప్పాయి తదితర పంటలను కలుపుకుని 6164 ఎకరాల్లో పంట దెబ్బతినగా, సుమారు 2982 మంది రైతులకు నష్టం వాటిల్లింది. రూ. 60 కోట్ల మేర పండ్ల తోటలకు నష్టం జరిగినట్లు ప్రాథ మిక అంచనాలు రూపొందించారు. జిల్లా వ్యాప్తం గా సుమారు 1300కు పైగా ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ పంటలకు సంబంధించి రూ. 6-7 కోట్ల మేర నష్టం వాటిల్లింది. పంటనష్టం అంచనాల్లో అధికారులు నిమగ్నమయ్యారు.హార్టిక ల్చర్, అగ్రికల్చర్‌కు సంబంధించి 200 మంది సిబ్బంది పొలాలను పరిశీలిస్తున్నారు.

నష్టాల గణనను త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: మిచాంగ్ తుపాను బాధితులపట్ల సానుభూతితో వ్యవహరించాలని, తుపాను ప్రభా విత గ్రామాలను పూర్వస్థితికి పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ జిల్లా అధికారులను ఆదే శించారు. తుఫాను ప్రభావంపై అన్నమయ్య, నెల్లూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధ వారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రాయచోటి నుం చి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఎస్పీ కృష్ణా రావులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వేకోడూరు డివిజన్‌లో అరటితోట లకు సంబంధించి నష్టాల గణనను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. నీటిపారుదల శాఖకు సంబంధించి పెద్దగా నష్టం జరగలేదని సంబంధిత అధికారులు కలెక్ట ర్‌కు వివరించారు. జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని కలెక్టర్ తెలిపారు. అన్నమయ్య జిల్లాలో దాదాపు ఏడు రహదారులు కొద్దిగా దెబ్బతిన్నాయ ని, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కలెక్టర్‌కు వివరించగా వాటిని త్వరితగతిన పునరుద్ధరించాలని ఆదేశిం చారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ, పశు సంవర్ధకశాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం 19 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఆరోగ్యశాఖ అధికారులు వివరించగా, అంటువ్యాధులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్ష సమా వేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ శ్రీలేఖ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. అన్నమయ్య జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో దెబ్బతిన్న అరటి తోటలను కలెక్టర్ పీఎస్ గిరీషా, ఎమ్మెల్యే కొర ముట్ల శ్రీనివాసులు, మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు పరిశీ లించారు. రైతులతో మాట్లాడి నష్టపోయిన రైతు లకు పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపా రు.రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తుపాన్ వల్ల జరిగిన పంట నష్టానికి సంబంధిం చి బుధవారం వ్యవసాయ, ఉద్యాన అధికారు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని చెప్పారు. రైతుకు అన్ని వేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు.

శభాష్..వలంటీర్



ఎంపీఈఓ రిజ్వానాతో కలసి దెబ్బతిన్న పంటపొలాల్లో పర్యటించిన వలంటీర్ శశికళ

గుర్రంకొండ: తుపాను సహాయక చర్యల్లో పలు వురు వలంటీర్లు పాల్గొంటూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు.బుధవారం మండల వ్యవసాయాధికారులు, సచివాలయ వ్యవసాయ ఉద్యోగులు గ్రామాల్లో పర్యటించారు. మండలం లోని ఎల్లుట్ల పంచాయతీ శీలంవారిపల్లెలో ఎంపీ ఈవో రిజ్వానా దెబ్బతిన్న పంటలను పరిశీలిం చారు. గ్రామానికి చెందిన వలంటీర్ శశికళ రైతు లకు ఈవిషయం తెలియజేసి వారిని పొలాల వద్దకు తీసుకొచ్చింది. గతంలో ఎన్నడూ పం టనష్టపోయిన సందర్భాల్లో అధికారులు వచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం నియమించిన వలంటీర్ల పుణ్యమా అని అధికా రులు పొలాల వద్దకే వచ్చి పంటనష్టం వివరాలు సేకరిస్తున్నారని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పెరిగిన అంచనా

వైఎస్సార్ జిల్లాలో 7695.89 హెక్టార్లలో పంటలకు దెబ్బ

కడప అగ్రికల్చర్: జిల్లాలో మిచాంగ్ తుఫాన్ కార ణంగా కురిసిన భారీ వర్షాలకు వ్యవసాయ పం టలకు భారీస్థాయిలో నష్టం వాటిల్లింది. సోమ, మంగళవారాలలో కురిసిన వర్షాలకు జిల్లాలో వరి, మినుము, జొన్న, మొక్కజొన్న, కంద, చెరకు, పండు మిరప, కొర్ర, అరటి, పొగాకు, వేరుశనగ, దోసపంటలకు సంబంధించి ఖరీ ఫ్‌లో 5828.89 హెక్టార్లలో, రబీకి సంబంధించి 1867 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు తయారు చేశారు. ఇలా ఖరీఫ్, రబీలకు సంబంధించి మొత్తం 7695.89 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు.

ఆరు మండలాల పరిధిలో..

జిల్లాలోని కడప, ఒంటిమిట్ట, వల్లూరు, సి.కె.దిన్నె, చెన్నూరు, సిద్దవటం మండలాల పరిధిలో ఉద్యాన పంటలకు సంబంధించి అరటి, బొప్పాయి, దోస, మిరప, మునగ, ఉల్లి, తమలపాకు, సంపంగి, చామంతి పంటలకు సంబంధించి 61 మంది రైతు లకు సంబంధించి 38.62 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథ మికంగా అంచనాలను వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు.

సిద్దవటంలో అత్యధిక వర్షపాతం

మిచాంగ్ తుఫాన్ కారణంగా ఏర్పడిన అల్పపీడనం తో జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధ వారం ఉదయం వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో సిద్దవటంలో 11.6 ఎంఎం వర్షం కురవగా కలసపాడులో 10.4 ఎంఎం, పోరుమామిళ్లలో 9.4 ఎంఎం, బద్వేల్‌లో 8.8 ఎం ఎం, గోపవరం, సింహాద్రిపురంలో 6.6 ఎంఎం, పోరుమామిళ్ల, బి.కోడూరులలో 4.4 ఎంఎం, వేములలో 4.2 ఎంఎం, కొండాపురంలో 3.8 ఎం ఎం, అట్లూరులో 3.4 ఎంఎం, ఎర్రగుంట్ల, సి.కె. దిన్నె, తొండూరు, వేములలో 3.2 ఎంఎం, బి.మఠం, వి.ఎన్.పల్లెలో 1.6 ఎంఎం చొప్పున.. చెన్నూరు, పెండ్లిమర్రిలలో 1.4 ఎంఎం, ఖాజీపేట, చక్రాయపేటలలో 1.2 ఎంఎం, కడప, లింగాల, మైదుకూరులలో 1 ఎంఎం, రాజుపాలెం, చాపా డులలో 0.4 ఎంఎం వర్షపాతం నమోదైంది.

ఓటర్ల నమోదు ప్రక్రియలో తప్పులకు ఆస్కారమివ్వద్దు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఓటర్ల నమోదు ప్రక్రియలో తప్పులకు ఆస్కారమివ్వరాదని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సం బంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్ట రేట్‌లో ఓటరు జాబితా సవరణపై ఆర్డీఓలు, తహసీ ల్దార్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొం దించడానికి సంబంధిత అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. జిల్లాలో వందశాతం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా ముం దుకు వెళ్లాలన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, బీఎల్ ఓలు ఫామ్-6 పెండెన్సీపై అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు.బీఎల్ఓలు ప్రొసీజర్ ప్రకారం క్లెయిమ్‌లకు సంబంధించి డాక్యుమెంట్లు ఫైల్ చేసుకుని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. 18, 19 సంవత్సరాల వయస్సు ఉన్న యువ ఓటర్ల నమో దుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 22-ఏ నిషేధిత భూముల నుంచి తొలగించిన రైతుల దగ్గర తప్పకుం డా ఈకేవైసీ తీసుకొని వారికి సర్టిఫికెట్లు జారీ చేయా లన్నారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్య నారాయణ, ఎన్నికల విభాగం అధికారులు తది తరులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో కుంభాభిషేకం

రాయచోటిటౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి పశ్చిమ రాజగోపుర కుంభాభి షేక మహోత్సవం ఈనెల 8,9 తేదీల్లో జరగనుంది. దీనికి హాజరు కావాలని జిల్లా అధికారులను, నాయకులను ఆలయ కమిటీ చైర్మన్ పోలంరెడ్డి విజయ, ఈవో డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరధరామిరెడ్డి ఆహ్వానిం చారు. బుధవారం వీరు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి దంపతులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సతీమణికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

'సెంచురీ' ప్యానెల్స్ సందర్శన



పరిశ్రమ ప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు

గోపవరం: ఈ నెల 23వ తేదీన సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమకు సంబంధించిన రెండు యూనిట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆ కంపెనీ కంపెనీ ప్రతినిధులు, బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణతో కలిసి బుధ వారం పరిశ్రమలో జరుగుతున్న పనులను పరిశీ లించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా చేపట్టా ల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రతినిధులు, అధికారులతో చర్చించారు. కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయె..

- 13వ తేదీ పాఠశాల స్థాయి పోటీలు
- 16న మండలస్థాయి..
- 19వ తేదీ చాపాడులో జిల్లాస్థాయిలో..
- ఏర్పాట్లలో విద్యాశాఖ అధికారులు



రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన లోగోను విడుదల చేస్తున్న డీఈఓ, డిప్యూటీ ఈఓ తదితరులు

కడప ఎడ్యుకేషన్: పిల్లలు ప్రతి పాఠశాలలోని విద్యార్థులు, సైన్స్ గణితం, సోషియల్ ఉపాధ్యా యులు ప్రతి సంవత్సరం ఎదురు చూసే పండగ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్‌ఫేర్) .ఈ సంవ త్సరం కూడా ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాకమిష నర్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ సంయుక్త ఆదేశాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 31వ తేదీలోగా పాఠశాలస్థాయి, మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించాల్సి ఉం ది. ఇందుకు విద్యాశాఖ సమాయత్తమ వుతోంది.



- ఈ పోటీలు మూడు కేటగిరీల్లో 8 అం శాల్లో నిర్వహిస్తారు.ఇందులో భౌతికశా స్త్రం,రసాయనికశాస్త్రం,
- గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, జీవశాస్త్రం, ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్ అనే అంశాల్లో పోటీ జరుగుతుంది. వీటిల్లో వ్యక్తిగతంగా, గ్రూపుగా, ఉపాధ్యాయ విభాగం లోగానీ పోటీ పడవచ్చు

పోటీలు ఎప్పుడంటే..

- ఈ నెల 13వ తేదీ పాఠశాల స్థాయిలో పోటీలు ఉంటాయి. ఆ పాఠశాలలోనే ఆ పాఠశాల ప్రధానో పాధ్యాయులు నిర్వహించాల్సి ఉంటుంది.
- ఈ నెల 16వ తేదీలోగా మండల విద్యాశాఖ అధికారి ఆ మండలంలో ఉన్న అన్ని పాఠశాలల నుంచి వచ్చిన మెరుగైన ప్రాజెక్టులతో మండలస్థాయి పోటీలను నిర్వహిం చాల్సి ఉంటుంది.
- 19వ తేదీన అన్ని మండలాల నుంచి వచ్చిన విద్యార్థులతో ఉప విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లాలోని చాపాడు మండలం పల్ల వోలులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జిల్లా సైన్స్ అధికారి అధ్యక్షతన జిల్లాస్థాయి పోటీ నిర్వహిస్తారు.
- ఈ నెల 28,29 తేదీలలో డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి అధ్యక్షతన వివిధ టీంల సమన్వయంతో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తారు.

వ్యక్తిగత విభాగంలో..

వ్యక్తిగత విభాగంలో పోటీపడే విద్యార్థులు 8 అం శాల్లో ఏదో ఒక దానిని ఎంచుకుని గైడ్ టీచర్ విద్యా ర్థి కలసి పాల్గొంటారు.

గ్రూపు విభాగంలో...

గ్రూపు విభాగంలో పోటీ పడే వారు ఎనిమిది అం శాలో ఏదో ఒకటి ఎంచుకుని ఇద్దరు విద్యార్థులు, ఉపాధ్యాయుడు కలిసి మొత్తం ముగ్గురు పోటీల్లో పాల్గొంటారు.


టీచర్ విభాగంలో..

టీచర్ విభాగంలో పోటీ పడేవారు ఎనిమిది విభా గాల్లో ఏదో ఒక దానిని ఎంచుకుని ఒక ఉపాధ్యా యుడు మాత్రమే పాల్గొంటారు.

ఐడీపీఎస్ పరిశీలన..

కాగా, ఈ నెల 19న జిల్లా సైన్స్ ప్రదర్శన నిర్వహి స్తున్న నేపథ్యంలో చాపాడు మండలం పల్లవోలు వద్ద గల ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ప్రొద్దుటూరు డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి బుధవారం సం దర్శించారు. గదులు, సైన్స్ ప్రదర్శనకు సంబంధిం చిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఎవరెవరు పాల్గొనవచ్చు..



- ప్రతి పాఠశాల నుంచి వ్యక్తిగత, గ్రూపు టీచర్ విభాగం నుంచి ఒక్కొ క్కటి మాత్రమే మండలస్థా యిలో పాల్గొనాలి
- మండల స్థాయిలో జరిగే పోటీల్లో కూడా వచ్చిన వ్యక్తిగత విభాగాల నుంచి ఒక దానిని, అన్ని గ్రూపుల నుంచి ఒక దానిని, అందరూ ఉపాధ్యాయుల నుంచి ఒకరిని జిల్లాస్థాయికి పంపించాలి
- జిల్లాస్థాయిలో జరిగే పోటీలో వచ్చిన అన్ని వ్యక్తిగత విభాగాల నుంచి మూడు ప్రాజెక్టుల ను.. అన్ని గ్రూపుల నుంచి మూడు ప్రాజెక్టుల ను.. అందరూ ఉపాధ్యాయుల నుంచి మూ డు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపించాలి
- రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాల నుంచి వచ్చిన వ్యక్తిగత విభాగాల నుంచి 15 ప్రాజెక్టు లను, అన్ని గ్రూపు విభాగాల నుంచి పది, అన్ని ఉపాధ్యాయు ప్రాజెక్టుల నుంచి పది ప్రాజెక్టులను మొత్తం 35 ప్రాజెక్టులను రీజ నల్ స్థాయికి పంపించాలి
- రీజనల్‌స్థాయిలో మొత్తం తొమ్మిది రాష్ట్రాల వాళ్లు పోటీపడతారు. రీజనల్‌స్థాయి ప్రద ర్శన కూడా మన రాష్ట్రమే నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం విజయవాడలో రాబోయే సంవత్సరం జనవరి 19 నుంచి 23 వరకు జరుగనుంది

కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలి



సైన్స్‌ఫేర్‌ను విజయవంతంగా పూర్తి చేసేం దుకు ప్రతి కమిటీ సభ్యులు బాధ్యతగా తీసు కోవాలి. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహణలో వివిధ కమిటీలు ఏర్పాటు చేస్తు న్నాం. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు సైన్స్ పరిమళాలు అందే విధంగా కృషి చేయాలి. – బి. మహేశ్వరరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలి



పాఠశాలలోని ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యా యుడు, మండలంలోని ఎంఈఓలు, డివిజన్‌స్థాయిలో డిప్యూటీ డీఈఓ ఈ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వ హించాలి. ఇందుకు కావాల్సిన కార్యాచరణ, ప్రణాళి కలు ఎవరికి వారు రూపొందించుకోవాలి. సమష్టి నిర్ణయాలు తీసుకుని ప్రతి విద్యార్థిలో సైంటిఫిక్ టెంబర్ వచ్చే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలి. –రాఘవరెడ్డి,విద్యాశాఖాధికారి,వైఎస్సార్ జిల్లా

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను విద్యార్థులు గమనించాలి. సాంకేతికతను అం దిపుచ్చుకోవాలి. అలాగే తన చుట్టూ ఉన్న సమస్యలకు పరిష్కారానికి కనుగొనే విధంగా విద్యార్థుల ఆలోచన ధోరణి మారేలా సైన్స్ సంబరాలను నిర్వహించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. – మార్తాల వెంకట క్రిష్ణారెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

హోంగార్డుల సేవలు వెలకట్టలేనివి

- జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు



జిల్లా ఎస్పీ క్రిష్ణారావు చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులను అందుకున్న హోంగార్డ్స్

రాయచోటి : హోంగార్డుల సేవలు వెలకట్టలేనివని జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు అభిప్రాయపడ్డారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 61వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై హోం గార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లాలో హోంగార్డులు పోలీసులతో సమానంగా సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. సాధారణ డ్యూటీలు మొదలు క్లిష్టతర విధుల వరకు అన్నింటా చక్కగా పనిచేస్తున్నారన్నారు. క్రైమ్, కంప్యూటర్ వర్క్, టెక్నికల్, కోర్టు, వృత్తి నైపు ణ్యం వంటి ప్రొఫెషనల్ వర్క్స్ వ్యక్తిగతంగా స్వీయ ప్రేరణతో నేర్చుకోవాలన్నారు. సమాజ సేవలో, శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు పోలీసులతో సమానంగా ఉన్నాయన్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉంటూ పారదర్శ కంగా నిజాయితీగా పనిచేయాలన్నారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టను పెం చేలా విధులు నిర్వర్తించాలన్నారు. హోంగార్డు రైజింగ్‌డే సందర్భంగా నిర్వహించిన క్రీడల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ఎస్పీ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, రాయచోటి డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా, ఏఆర్ డీఎస్పీ పి.మహబూబ్‌బాషా, పీఎస్ఓ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జావీద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అడ్మిన్ ఎం .పెద్దయ్య, పోలీసు మోటారు వాహనాల అధికారి ఎస్.మహబూబ్‌వలీ, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడి అరెస్టు


తండ్రిని చంపిన కుమారుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఓబులవారిపల్లి : మండల కేంద్రమైన ఓబులవారిపల్లెలో సయ్యద్ మహ్మద్ (60)ను హత్య చేసిన కుమారుడు సయ్యద్ మహబూబ్ బాషాను బుధవారం అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు పోలీస్ స్టేషన్ సమీపంలో మహ్మద్‌ను ఆయన కుమారుడు మహబూబ్ బాషా కర్రతో తలపై కొట్టి పారిపోయాడన్నారు. చికిత్స నిమిత్తం రాజంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని తెలిపారు. బుధవారం రైల్వేస్టేషన్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతన్ని విచారించగా మహబూబ్ బాషా భార్యను వదిలేసి ఇంటిలో ఉంటూ ఏ పనీ చేయకుండా తిరుగుతుండటంతో తండ్రి ప్రతిరోజూ మందలించేవాడన్నారు. దీంతో తండ్రిపై దాడి చేశాడని తెలిపారు. సెక్షన్ 302 ప్రకారం నిందితునిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య పాల్గొన్నారు.

జీవనోపాధికి కొత్త బాట

- ఎస్సీ,ఎస్టీ మహిళలకు తోడ్పాటు
- ఉన్నతి పథకంతో సున్నా వడ్డీకే రుణాలు
- ఆటో రిక్షాల కొనుగోలుకు ప్రోత్సాహం
- సులభ వాయిదాల పద్ధతిలో చెల్లింపునకు అవకాశం
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 22 మంది ఎంపిక
- నేడు లబ్ధిదారులకు ఆటోలు పంపిణీ


ఆటోను నడుపుతున్న మహిళ

కడప కోటిరెడ్డిసర్కిల్/రూరల్ : మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. నిరంతరం ఆదాయం పొందేలా చేయూతనిచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా వడ్డీలేని రుణాలు అందించనున్నారు. ఎస్సీ ఎస్టీ మహిళలపై ఎలాంటి భారం పడకుండా రుణాలు చెల్లిస్తూ సొంత కాళ్లపై నిలబడేందుకు ఉన్నతి మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించారు. దీని ద్వారా ఆటోలు ఇవ్వనున్నారు. వైఎస్సార్ జిల్లాలో ఆటోల కోసం దాదాపు 20 దరఖాస్తులు రాగా, వాటిలో అన్ని విధాలా అర్హులైన 11 మందిని ఎంపిక చేశారు.

కుటుంబాన్ని పోషించేందుకు మహిళలు ఆటో డ్రైవర్‌గా పనిచేయాల్సి వస్తోంది. డ్రైవింగ్ నైపుణ్యం ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేని కారణంగా అద్దెకు ఆటోలు తీసుకుని నడుపుతున్నారు. ఆటో యజమానికి రోజుకు రూ. 400–500 అద్దె చెల్లించాల్సి వస్తోంది. అలాగే ఆటోలకు ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు దానికి మరమ్మతులు సైతం వారే చేయించుకోవాల్సి వస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటో నడిపినప్పటికీ కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. సొంతంగా ఆటో కొనుగోలుకు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అద్దె ఆటోలతో బతుకు బండిని నెట్టుకొస్తున్నారు. దీనిని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతి మహిళా శక్తి పథకం ద్వారా సొంతంగా ఆటోలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో మొత్తం 22 మంది మహిళలను ఎంపిక చేశారు.

వడ్డీ లేకుండా రుణాలు

మహిళల ఆదాయాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. అక్కాచెల్లెమ్మల కోసం ఉన్నతి మహిళా శక్తిని రూపొందించిన అధికారులు వడ్డీలేకుండా రుణాలు ఇచ్చేందుకు సమాయత్తమయ్యారు. ఇందుకుగాను దరఖాస్తులను ఆహ్వానించి పలువురిని ఎంపిక చేశారు. లబ్ధిదారులు ఆటో కొనుగోలుకు అయ్యే ఖర్చులో కేవలం 10 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. మిగతా 90 శాతం రుణం సెర్ప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఈ రుణానికి ఎలాంటి వడ్డీ ఉండదు. మొత్తం ఈ రుణాన్ని 48 సులభ వాయిదాల్లో చెల్లించే సౌకర్యం కల్పించారు. ఇందుకోసం మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఈ రుణాలు డ్వాక్రా సభ్యులకు మాత్రమే అందజేస్తారు.

జిల్లాలో ఎంపికైన లబ్ధిదారులకు ఇటీవల విజయవాడలో ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఆటోలు ఎక్కువ కాలం నడిపేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్ మెలకువలు నిపుణులచేత ఇప్పించారు. చిన్నచిన్న సాంకేతిక సమస్యలను ఎలా అధిగమించాలో వివరించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా రవాణాశాఖ అధికారులకు కూడా పలు సూచనలు జారీ చేసింది. లైసెన్సుల జారీ విషయంగా ఉన్నతి లబ్ధిదారులకు సహకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

నేడు ఆటోల పంపిణీ

గురువారం ఉదయం 11 గంటలకు మహిళా శక్తి కార్యక్రమం కింద విజయవాడలో అధికారులు మహిళలకు ఆటోలు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో వీసీ ద్వారా వీక్షించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ జిల్లాలో 11 మంది ఎంపిక

ఆటోలను అందజేసేందుకు జిల్లాలోని ఐదు మండలాల నుంచి 11 మంది మహిళలను ఎంపిక చేశారు. ప్రొద్దుటూరు నుంచి ముగ్గురు, పెండ్లిమర్రి, ఒంటిమిట్ట, సిద్దవటం, వల్లూరు మండలాల నుంచి ఇద్దరు చొప్పున ఎంపిక చేశారు.

అన్నమయ్య జిల్లా నుంచి మరో 11 మంది

అన్నమయ్య జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, కలకడ, మదనపల్లె, కురబలకోట, వాయల్పాడు మండలాల నుంచి ఒక్కొక్కరికి, కలికిరి మండలానికి సంబంధించి ఇద్దరికి ఆటోలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.

మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోంది. పేదరికం నుంచి విముక్తి కోసం మహిళలకు అండగా నిలుస్తోంది. వీరు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు మౌలిక వసతులు, ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని గ్రామీణ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. ఇందులో భాగంగా ఉన్నతి పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. మహిళలు తమ శక్తిని నిరూపించుకునేందుకు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఆనంద్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ, కడప



కార్పొరేట్‌కు దీటుగా విద్యావ్యవస్థ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు నేడు కార్యక్రమంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందింది. ప్రభుత్వ బడుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అధునాతన సౌకర్యాలతో పాటు నూతన విద్యా విధానాలతో విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాఠశాలలకు వస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి వల్లే ఇది సాధ్యమైంది.

– నాగిరెడ్డి, ఉపాధ్యాయుడు, పీలేరు.

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల, బర్త్ సర్టిఫికెట్ల కోసం ఎంఆర్‌ఓ కార్యాలయానికి కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టి వలంటీర్లు గ్రామ సచివాలయంలోనే కుల, ఆదాయ, జనన, మరణ సర్టిఫికెట్లు అందించారు. మాకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేసి ఆఫీసుల చుట్టూ తిరగకుండా చేసి జగనన్న దేవుడయ్యాడు.

– జాలా కృష్ణవేణి, జీఎంఆర్ కాలనీ, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం, ఇసుకపల్లికి చెందిన లక్కి వెంకటేష్ అనే బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 2వ తేదీన జంగిటివారిపల్లిలో అత్త వారింటికి వచ్చిన బాలుడు 4వ తేదీ కిడ్నాప్‌కు గురయ్యాడని బాలుడి మామ శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. బుధవారం ఈ కిడ్నాప్ కేసుకు సంబంధించి కమలాపురానికి చెందిన మీనా, నవీన్, ప్రతాప్ అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ డబ్బు కోసం నిందితులు బాలుడిని కిడ్నాప్ చేశారని తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ


తలకు తీవ్ర గాయాలైన రామునాయక్

గాలివీడు : మండల పరిధిలోని తూముకుంట గ్రామం ప్రకాష్‌నగర్ కాలనీలో బుధవారం ట్యాంకు నుంచి ఇంటి ముందు మంచినీరు పారుతోందని ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఈశ్వర్‌నాయక్ పార తీసుకొని రామునాయక్ తలమీద బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. కుటుంబ సభ్యులు, బంధువులు కడప రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెంకటశివకుమార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన సాకే పుల్లప్ప కుమార్తె సాకే కీర్తన (17) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ కె. రాజారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చిలంకూరు గ్రామానికి చెందిన సాకే పుల్లప్ప, ఓబుళమ్మలు ప్రొద్దుటూరులోని సీఎంఆర్‌లో సెక్యూరిటీ గార్డుగా, స్వీపర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సాకే కీర్తన ఇంటర్ ఫెయిల్ కావడంతో ఇంటి వద్దనే ఉంటోంది. అయితే గత కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో మంగళవారం రోజు ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. మృతురాలి తండ్రి సాకే పుల్లప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

కడప కార్పొరేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ భారత దేశ పునర్నిర్మాణ దృష్టితో ఆయన రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగంలో ప్రపంచ మానవతా సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయని, లౌకిక భావన, ప్రజాస్వామ్య వ్యవస్థల్లోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను భారత ప్రజలకు అందించడానికి తీవ్రంగా కృషి చేశారన్నారు. అంబేడ్కర్ జీవన విధానం అందరికీ ఆదర్శప్రాయమని, కుల నిర్మూలన, అస్పృశ్యతా నివారణ, ఆర్థిక సమానత్వం, మానవ హక్కులు, బహుజన సాధికారతలను సాధించడానికి జీవితాంతం కృషి చేశారన్నారు. అంబేడ్కర్ అడుగుజాడల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు రాజ్యాధికారాన్ని చేరువ చేశారని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్ నాయక్, బండి ప్రసాద్, కె. బాబు, త్యాగరాజు, చైతన్య, శ్యాంసన్, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి, పి. సంపత్, లక్ష్మినారాయణ, మేసా ప్రసాద్, ఎస్. ప్రసాద్‌రెడ్డి, కిరణ్, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, చైతల్య, సుశీలమ్మ పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

రూ.4లక్షల విలువచేసే 80గ్రాముల బంగారు స్వాధీనం


నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ హరిహరప్రసాద్

మదనపల్లె : క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి ఈజీమనీ కోసం చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రూ.4లక్షల విలువ చేసే 80గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ... కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ దాదంవారిపల్లెకు చెందిన మహబూబ్‌పీరా కుమారుడు సయ్యద్ బహదూర్(24) క్రికెట్ బెట్టింగ్‌లు ఆడుతూ, అందులో నష్టపోవడంతో ఈజీమనీ కోసం చైన్‌స్నాచింగ్‌ను ఎంచుకున్నాడు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్యాస్ గోడౌన్, మిషన్ కాంపౌండ్‌తో పాటు ఇతర ప్రదేశాల్లో గత ఏడాది 5 చోట్ల వేర్వేరు సందర్భాల్లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఆయా ఘటనలపై కేసులు నమోదు కాగా, నిందితుడు విదేశాలకు పారిపోయాడు. ఇటీవల చైన్‌స్నాచింగ్ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో ప్రత్యేకబృందంతో నిఘా ఉంచారు. అందులో భాగంగా చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన నిందితుడికి సంబంధించిన సమాచారం అందడంతో బుధవారం పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో తనిఖీలు నిర్వహించారు. నిందితుడు అంగళ్లు నుంచి మదనపల్లెకు వస్తున్న ఆటో నుంచి దిగి పారిపోవడం గమనించి, అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారిస్తే, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నాలుగు కేసులకు సంబంధించిన 80 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులోని బంగారును నిందితుడు బ్యాంకులో తాకట్టులో ఉంచాడు. నిబంధనల మేరకు బంగారాన్ని రికవరీ చేస్తామని సీఐ తెలిపారు. నిందితుడిపై రౌడీషీట్ ఓపెన్‌చేసి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ హరిహరప్రసాద్, దర్యాప్తు బృందాన్ని సీఐ అభినందించారు. వాకింగ్‌కు వెళ్లే మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

భార్యపై భర్త దాడి

మదనపల్లె : మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకపోవడంతో భార్యపై భర్త దాడిచేసిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన రామాంజులు, అతడి భార్య ఆర్.మంగళ కూలిపనులు చేస్తూ జీవిస్తున్నారు. బుధవారం భార్యాభర్తల మధ్య మద్యానికి డబ్బులు ఇవ్వలేదని గొడవ జరిగింది. దీంతో ఆవేశానికి గురైన భర్త రామాంజులు భార్య మంగళపై కత్తితో దాడిచేశాడు. దాడిలో ఆమె చేతికి కత్తి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో యువ రైతు మృతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన యువరైతు గోసుల నాగరాజారెడ్డి (45) బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందినట్లు సీకేదిన్నె ఎస్ఐ బి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ ఏఈ వేణుగోపాల్ పరిశీలించారు.

ఒకటే ముఖం.. ఓట్లు బహుముఖం!

- టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుటుంబీకులకు రెండు చోట్ల ఓట్లు
- ప్రొద్దుటూరు, కోగటంలో నమోదు


తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా దొంగ ఓట్లు, డబుల్ ఓట్లపై రాద్ధాంతం చేస్తోంది.. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు ఇలాంటి ఓట్లను కలిగి ఉన్నారని, తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను కలిసి స్వయంగా ఫిర్యాదు చేశారు. అయితే వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందనడానికి ఇదే ఉదాహరణ.

- ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తన కుటుంబీకులతోపాటు తన అనుచరుల ఓట్లను కూడా అటు కమలాపురం మండలం కోగటం గ్రామంలో, ప్రొద్దుటూరులో నమోదు చేయించారు.
- కమలాపురం మండలంలోని కోగటం గ్రామానికి సంబంధించిన 2024 ఓటర్ల జాబితాలో ప్రవీణ్ కుమార్‌రెడ్డి తనతోపాటు తన కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేయించారు. గ్రామంలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల పోలింగ్ బూత్‌లో వరుసగా ఈ ఓట్లు నమోదై ఉన్నాయి.
- ఓటర్ల జాబితాలో వరుస నంబర్ 820లో టీడీపీ ఇన్‌చార్జి గండ్లూరు వీరప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఓటు నమోదైంది. అలాగే ఇదే జాబితాలో తన తల్లిదండ్రులు గండ్లూరు వీరప్రతాప్‌రెడ్డి, గండ్లూరు పద్మావతమ్మతో పాటు గండ్లూరు మౌనిక రెడ్డి, గండ్లూరు హిమజ రెడ్డి, గండ్లూరు వీరప్రదీప్ కుమార్‌రెడ్డి, గండ్లూరు హరిత రెడ్డి పేర్లు నమోదు చేశారు. ఇందులోనే ప్రవీణ్ అనుచరులైన బాలు రబ్బా, చరణ్ పేర్లు ఉండటం గమనార్హం.
- ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీకి సంబంధించి 3/1003 డోర్‌నంబర్‌లో టీడీపీ ఇన్‌చార్జి వీరప్రవీణ్ కుమార్‌రెడ్డి గండ్లూరు, వీరప్రదీప్ కుమార్‌రెడ్డి గండ్లూరు, హిమజ రెడ్డి గండ్లూరు, మౌనిక రెడ్డి గండ్లూరు పేర్లు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా ఈ సంఘటనపై విచారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డబుల్ ఓట్లను తొలగించాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్లూరి వీరప్రవీణ్ కుమార్‌రెడ్డికి సంబంధించి డబుల్ ఓట్లపై విచారణ చేసి వెంటనే తొలగించాలని 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి బుధవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తప్పులు టీడీపీ నేతలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అభాండాలు వేస్తున్నారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ప్రవీణ్ ప్రొద్దుటూరు పట్టణంలోని 3/1003 డోర్ నంబర్‌లో, కమలాపురం మండలం కోగటం గ్రామంలోని 6/108 డోర్ నంబర్‌లో ఎలా ఓట్లు కలిగి ఉంటారన్నారు. మొత్తం కుటుంబ సభ్యుల పేర్లన్నీ ఓటరు జాబితాలో ఉన్నాయని తెలిపారు. 2019 ఎన్నికల్లో కూడా ఈ కుటుంబానికి ప్రొద్దుటూరు, కోగటంలో ఓట్లు ఉన్నాయని, ఇప్పటికీ అదే పరిస్థితి ఉందన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి డబుల్‌ఓట్లను, దొంగ ఓట్లను తొలగించాలని కోరారు.

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ


డాక్టర్లను, వైద్య విద్యార్థులను అభినందిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసస్సిటేషన్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. జాతీయ వైద్య కమిషన్ ఆదేశాల మేరకు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, అనస్థీషియా విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సునీల్ చిరువెళ్ల ఆధ్వర్యంలో బుధవారం సీపీఆర్‌పై అవగాహనను కడప రిమ్స్‌తో పాటు, మరో రెండు చోట్ల నిర్వహించారు. కడప రిమ్స్ వైద్య కళాశాల సెమినార్ హాల్‌లో వైద్య విద్యార్థులు సీపీఆర్ నిర్వహించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ విజయదుర్గ, 250 మంది వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది హాజరయ్యారు.

- పోలీస్ సిబ్బంది కోసం ఉమేష్ చంద్ర స్మారక కల్యాణ మండపంలో డాక్టర్ శృతితో పాటు, వైద్య విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
- కడపలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ సోనియాబేగం, 300 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.